క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ మస్తాన్ వలి

కంభం: మండలంలోని చిన్నకంభంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి తనిఖీ చేశారు. సరాసరి వేతనం రూ. 300 అందేలా పనులు చేయాలని కూలీలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో జాబ్‌కార్డులు కలిగి ఉండి ఇంకా పనులకు రాని వారిని గుర్తించి వారందరు కూడా పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. పని జరిగే ప్రదేశాల్లో ఎండలు అధికంగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. అనంతరం హాజరు పట్టిక, రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ ఏడుకొండలు ఉన్నారు.

ముగిసిన గంధ మహోత్సవం



దర్గాలో పూజలు చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మండలంలోని నందనమారెళ్ల వద్ద ఉన్న నాగూర్ మీరా స్వామి (ఖాదర్ వలి) దర్గా గంధ మహోత్సవం శనివారం ప్రత్యేక పూజలతో ముగిసింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ దర్గా వద్ద శుక్రవారం రాత్రి విశిష్ట పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు ఉన్నవారు స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్, బీసీ సంఘ నాయకులు ద్రోణాదుల చెంచులు, బారాయిమామ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం పాలేటి గంగ సమీపంలో వెలసిన గంగమ్మ ఆలయంలో గత రెండు రోజులుగా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం గంగమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గురుకులలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గిరిజన బాలికా విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రజని తెలిపారు. మూడో తరగతిలో 40 సీట్లు, నాల్గవ తరగతిలో 36 సీట్లు, 5వ తరగతిలో 23 సీట్లు, ఆరో తరగతిలో 28 సీట్లు, ఏడవ తరగతిలో 16 సీట్లు, 8వ తరగతిలో 24 సీట్లు, 9వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిని లాటరీ పద్ధతిలో భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 6303145785 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మాలకొండ ఆదాయం రూ.18,85,865

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.1885,865 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.32,320, తలనీలాలు రూ.1,06,185, ప్రత్యేక దర్శనం రూ.6,32,200, లడ్డుప్రసాదాలు రూ.2,55,590, అన్నదానం రూ.7,29,354, రూమ్‌అద్దెలు రూ.23,650 వచ్చినట్లు తెలిపారు.

వేడుకగా శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో ద్వాదశ 12వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అలంకరణ వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీరామనామం, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలతో పాటు శ్రీలక్ష్మీ నారాయణ స్వామి కల్యాణం భక్తుల జయజయ ధ్వానాలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా ఎస్ దుర్గారావు, పద్మావతి, ఎస్ జగదీష్, అనూష దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. జూన్ 1వ తేదీ వరకు సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.



అలంకరణలో శ్రీలక్ష్మీనారాయణస్వామి ఉత్సవ మూర్తులు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

కన్నుల పండువగా లక్ష్మీ చెన్నకేశవునికి కళ్యాణం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీ.కేశవరావు, ఈవో జీ.శ్రీనివాస రెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామివారు

వెలుగొండలో భక్తుల సందడి



అలంకరణలో శ్రీవారు



శ్రీవారి ఆలయంలో భక్తుల పూజలు

● దాతల సహకారంతో భక్తులకు అన్నదానం

కొనకనమిట్ల: ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు శ్రీవారిని దర్శించుకొని పునీతులయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు రావటంతో సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రతి శనివారం శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అన్నదాన సత్రం కమిటీ సభ్యులు జగన్, రత్నంశెట్టి, జవ్వాజి లక్ష్మీనారాయణ అన్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

కొమరోలు: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని అల్లినగరం గ్రామంలో శనివారం పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం అందుకున్న ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పేకాట శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడిలో రూ.10,500 నగదు స్వాధీనం చేసుకుని ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లుగా ఎస్సై తెలిపారు. ఎవరైనా పేకాట ఆడినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మధుసూదన్‌రావు హెచ్చరించారు.

సానికవరంలో ఆటల పోటీలు

పెద్దారవీడు: హనుమాన్ జయంతి సందర్భంగా మండలం పరిధిలో సానికవరం వీరాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 30వ తేదీన స్లో బైక్ రైడింగ్, పరుగు పందెం, స్కిప్పింగ్, కబడ్డీ, కప్ప దూకుడు, 31వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలు, గంప కొట్టడం, తాడు లాగుట, మ్యూజికల్ చైర్స్, పాటలు పాడుట, అంత్యాక్షరి పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జూన్ 1వ తేదీ సాయంత్రం బహుమతులు అందజేస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్ 79897 69829, 63027 80194 నంబర్లను సంప్రదించాలని కోరారు.

యోగా శిక్షణపై అవగాహన

పెద్దదోర్నాల: వేసవి శిక్షణ తరుగతుల్లో భాగంగా శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా శిక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడి

పెద్దదోర్నాల: నలమల్ల అభయారణ్యంలోని ఇష్టకామేశ్వరి గుడి సమీపంలోని మర్రిపెంట వద్ద యువకుడిపై ఎలుగుబంటి దాడి చేసిన సంఘటన శనివారం జరిగింది. ఈ సంఘటనలో ఇష్టకామేశ్వరి గూడేనికి చెందిన కుడుమల బయ్యన్న తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని రేంజి అధికారి ఆరీఫ్‌ఖాన్ మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి

కనిగిరి రూరల్: పట్టణంలోని విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈఈ హరిబాబు, విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందచేశారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అనేక వార్డుల్లో లో ఓల్టేజీ సమస్య వెంటాడుతుందన్నారు. ఏడో వార్డులోని కొత్తూరు చింతంగుంట్ల వారి వీధిలో, రెండో వార్డులోని బీసీ కాలనీలో, 11వ వార్డులోని కాశిరెడ్డి కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు డీఈఈ హరిబాబు తక్షణం పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏడీఈ ఉమాకాంత్, విద్యుత్ అధికారులు ఉన్నారు.

ఫోర్జరీ ధ్రువీకరణ పత్రంపై ఫిర్యాదు

గిద్దలూరు రూరల్: గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చినట్లు ఫోర్జరీ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించిన వారిపై స్థానిక పోలీసులకు వీఆర్ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్యతో పాటు రెవెన్యూ అధికారులు కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలోని జయరాంపురం గ్రామ రెవెన్యూ పరిధిలో అసైన్‌మెంట్ 402 సర్వే నెంబరు 643/4 లోని 82.79 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని అవిజ అరుణకుమారికి చెందినట్లు గ్రామ రెవెన్యూ అధికారి ఈశ్వర్‌రెడ్డి సంతకం చేసినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రం తయారు చేసుకున్నారు. వారు ఆ ధ్రువీకరణ పత్రం తీసుకుని సదరు స్థలాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లారు. అసైన్‌మెంట్ భూమిపై ధ్రువీకరణ పత్రం ఎలా ఇచ్చాడని అనుమానం వచ్చిన రిజిస్ట్రార్‌శాఖ అధికారులు విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో రెవెన్యూ శాఖ అధికారులు ఈ విషయంపై విచారణ జరిపించాలని కోరుతూ స్థానిక సీఐ వైవీ సోమయ్యకు ఫిర్యాదు చేశారు. ఒక రెవెన్యూ అధికారి సంతకం పెట్టకున్నా దొంగ సంతకాలు పెట్టుకుని నకిలీ స్టాంపులు తయారు చేయించుకుని ఫోర్జరీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వీఆర్ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య కోరారు.

జైలును ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్జి

గిద్దలూరు రూరల్: స్థానిక సబ్ జైలును గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదా నమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీల వివరాలను సూపరింటెండెంట్ లింగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలతో మాట్లాడుతూ క్షణికావేశంలో మీరు చేసిన తప్పులతో జైలు శిక్ష అనుభవిస్తు మీ కుటుంబ సభ్యులను కూడా ఇబ్బందులకు గురిచేశారన్నారు. శిక్ష పూర్తి అయిన తర్వాత ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మీకు వస్తున్న సదుపాయాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను నిల్వ ఉంచే స్టోర్ రూమ్, రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట కోర్టు సిబ్బంది ఉన్నారు.



జైలు అధికారితో మాట్లాడుతున్న జడ్జి

విజ్ఞానానికి నిలయాలు గ్రంథాలయాలు



మాట్లాడుతున్న విజయలక్ష్మి, పక్కన శివారెడ్డి



వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులు

మార్కాపురం: విజ్ఞానానికి నిలయాలు గ్రంథాలయాలని గ్రంథపాలకుడు శివారెడ్డి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7 వరకు మార్కాపురం గ్రంథాలయంలో శిక్షణ ఏర్పాటు చేశామని ఇందులో చెస్, పుస్తక పఠనం, పాటలు పాడటం, వ్యాసరచన, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. శనివారం నాటి శిబిరానికి కొల్లి విజయలక్ష్మి హాజరై ఏకాగ్రతపై వివరించారు. బ్రెయిన్ గేమ్స్ ఆడించారు. విద్యార్థులతో పాటలు పాడించారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, కథలు చెప్పడం, పాటలు పాడించడం, డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. 32 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థినీ, విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి కోరారు.

అందరూ కలిసి మెలసి ఉండాలి



గొట్లగట్టులో మాట్లాడుతున్న ఎస్ఐ

కొనకనమిట్ల: రాజకీయ వివాదాలకు పోకుండా గ్రామాల్లోని ప్రజలంతా కలిసి మెలసి ఉండాలని ఎస్ఐ మాధవరావు అన్నారు. శనివారం పొదిలి సీఐ మల్లికార్జునరావు పర్యవేక్షణలో మండలంలోని చింతగుంట, గొట్లగట్టు గ్రామాల్లో రాజకీయ పార్టీ నాయకులు, ప్రజలతో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా గ్రామాల్లో అల్లర్లకు పాల్పడి గొడవలకు కారణమవుతారో అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ఒకరికొకరు రెచ్చగొట్టే మాటలు మాట్లాడుకొని, గొడవలు పడి పోలీస్‌స్టేషన్లకు వచ్చి ఇబ్బందులు పడకూడదని ప్రజలకు సూచించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖాధికారులు



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో రాజశ్రీ

గిద్దలూరు రూరల్: మండలంలోని క్రిష్ణంశెట్టిపల్లె రైతుభరోసా కేంద్రం వద్ద శనివారం స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు జనుము, పిల్లిపెసర వంటివి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలతో కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ఎకరాకు 10 కిలోల చొప్పున వేసుకుని పూత దశకు వచ్చిన సమయంలో పొలంలోనే కలియదున్నాలన్నారు. 2023-24 పంట నష్ట పరిహారం జాబితాను తయారు చేసి సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కొమరోలు: మండలంలోని కొమరోలు-3 రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ విత్తనాలను మండల వ్యవసాయశాఖ అధికారిణి రాజశ్రీ పంపిణీ చేశారు. రాజశ్రీ మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం రాయితీపై అందచేస్తుందని తెలిపారు. ఎకరాకు 10 కిలోల చొప్పున పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుని పూతదశకు వచ్చినపుడు పొలంలో కలియదున్నుకోవడం వలన భూమి సాంద్రత పెంచుకోవచ్చని రైతులకు సూచించారు.

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

కొండపి(సింగరాయకొండ): కొండపి పంచాయతీలోని కట్టవారిపాలెంలో శనివారం పోలేరమ్మతల్లి 11వ వార్షిక వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పునర్ నిర్మించి 11 ఏళ్లు నిండి 12వ సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వినాయక, నాంచారమ్మ దేవత సమేత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామస్తులు అమ్మవారికి సద్ది, పసుపు నీరు తీసుకొని ఊరేగింపుగా గుడి వద్దకు తీసుకొని వచ్చి సమర్పించారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం 2 వేల మందికి అన్నదానం చేశారు.



గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

అన్ని పార్టీల అభ్యర్థులతో ఆర్వో సమీక్ష

● ఫారం-18 త్వరగా సమర్పించాలని సూచన



కౌంటింగ్‌పై సూచనలు చేస్తున్న ఆర్వో లోకేశ్వరరావు

దర్శి: స్థానిక ఆర్వో కార్యాయంలో శనివారం కౌంటింగ్‌పై అన్నిపార్టీల అభ్యర్థులు, ఏజెంట్లతో రిటర్నింగ్ అధికారి ఎంవీ లోకేశ్వరరావు సమీక్షించారు. జూన్ 4వ తేదీన ఒంగోలు సమీపంలోని రైజ్ కళాశాలలో జరగబోయే కౌంటింగ్ ఏర్పాట్ల కోసం చర్చించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్ట్రాంగ్ రూమ్, కౌటింగ్ హాల్స్ తయారు చేసే విధానం, పార్లమెంటు మరియు అసెంబ్లీ కౌంటింగ్ హాల్లో 14 టేబుళ్లు ఏ విధంగా వేయాలి? కౌంటింగ్ అరేంజ్‌మెంట్లు చేస్తున్న విధానం వివరించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు సమర్పించాల్సిన ఫారం- 18 వీలైనంత త్వరగా ఇవ్వాలని, ఏజెంట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్‌కు నలుగురు ఏజెంట్లు నియమించుకోవాలని, అదేవిధంగా ఏ విధమైన మొబైల్స్, ఎల్రక్టానిక్ గ్యాడ్జెట్స్ కౌంటింగ్ హాల్ లోపలికి అనుమతించబడవని, కౌంటింగ్ హాల్లో ఏజెంట్లు పాటించాల్సిన నియమ నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులు వివరించారు. రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ మొదటి ఫ్లోర్‌లో దర్శి దర్శి నియోజకవర్గానికి సంబంధించిన అసెంబ్లీ, పార్లమెంటు, పోస్టల్ బ్యాలెట్ మూడు కౌంటింగ్ హాల్స్‌లో కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ వివరాలు అందరు అభ్యర్థులకు రాతపూర్వకంగా అనెక్జర్ 34 నందు తెలియజేశారు. చీఫ్ ఏజెంట్లు ఎవరైనా రీ ఓక్ ఫామ్-9లో సమర్పించాలని, కౌంటింగ్ ఏజెంట్లు ఫారం 18 ఇచ్చిన తర్వాత వారిని మార్చుకోవాలన్నా ఫారం-19 సమర్పించవచ్చని తెలిపారు. వారందిరికీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గుర్తింపు కార్డులు మంజూరు చేస్తారని, గుర్తింపు కార్డులు కలిగిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఏ విధమైన ఊరేగింపులు, సభలు నిర్వహించాలన్నా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. బాణసంచా కాల్పులు నిషేధించబడ్డాయని, అతిక్రమించిన వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లో ఈ రోజు వరకు ఈ టీపీబీఎస్‌కు సంబంధించిన 220 సర్వీస్ ఓటర్స్ గాను, నేటికి 72 ఓట్లు పోస్టు ద్వారా వచ్చినందున వాటిని సీల్లు వేసిన బాక్సుల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వేయించి సదరు స్ట్రాంగ్ రూమ్‌కు సీల్లు వేయించి లాగ్ బుక్‌లో సంతకాలు అందరి సమక్షంలో సాయుధ సిబ్బందికి అప్పగించినట్లు ఆర్వో తెలిపారు.

వైభవంగా వేణుగోపాల స్వామి ఉత్సవాలు



సోమేపల్లిలో వేణుగోపాలస్వామి ఉత్సవాలు

త్రిపురాంతకం: శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వారి ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. మండలంలోని సోమేపల్లిలో శ్రీవేణుగోపాల స్వామి వారి ఉత్సవాల సందర్భంగా స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దంపతుల పూజలు జరిగాయి. మహిళలు పొంగళ్లు సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవారి కల్యాణం వైభవంగ జరిగింది. భక్తులకు ఆశీర్వచనం అందించారు.

మేట్ల వ్యవస్థను కొనసాగించాలి

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిలోని శ్రమ శక్తి సంఘాల మేట్ల వ్యవస్థను కొనసాగించాలని జిల్లా వ్యవసాయ శాఖ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ముప్పళ్లపాడులో ఉపాధి కూలీలు పనిచేస్తున్న పనుల ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రమశక్తి సంఘాల ఉపాధి మేట్లను తొలగించడంతో కూలీల మస్టర్లు సమయానికి తీయలేక పోతున్నారన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కందుకూరు సెబ్ అధికారులు మండలంలోని పూరేటిపల్లి-కళవళ్ల గ్రామాల మధ్య శనివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పూరేటిపల్లికి సమీపంలో ఉన్న మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న సెబ్ ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడులు చేసి కళవళ్ల అడ్డరోడ్డు రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. రెండు ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.